# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి దేశంలో అగ్ర స్థానంలో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ రాష్ట్రంలో 1,300 కిలోమీటర్ల రహదారులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.
- ❖ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ ని ప్రభుత్వం రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ ఆడ పిల్లల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.
- ❖ దక్షిణ అండమాన్ సముద్రంపై రేపు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2047 నాటికి దేశంలో అగ్ర స్థానంలో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి “స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్”ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం కల్పించడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించిందని తెలిపారు. సంస్కరణల ద్వారానే ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురాగలమని అన్నారు. విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర దశ, దిశను మారుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్రంలో 1,300 కిలోమీటర్ల రహదారులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. త్వరలోనే ఈ పనులు మొదలవుతాయని అన్నారు. ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గం కొత్తపల్లి గ్రామం వద్ద కోనపల్లి రోడ్డు మరమ్మతు పనులను ఈ రోజు మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 861 కోట్ల రూపాయల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతు పనులు చేపట్టామని వివరించారు. సంక్రాంతి నాటికి అన్ని రోడ్లకు గుంతలు పూడ్చే పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లాలో దాదాపుగా 21 కోట్ల రూపాయలతో 1,313 కిలో మీటర్ల రహదారుల మరమ్మతు పనులు చేపట్టామని తెలిపారు.

===================

కోట్లాది మంది ప్రజల జీవన ప్రమాణాలను అన్ని విధాలుగా మెరుగుపరచాలన్న ఉద్దేశ్యంతో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ ని ప్రభుత్వం రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. విజయవాడలో ఈ రోజు జరిగిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ డాక్యుమెంట్ బాటలు వేస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "వికసిత భారత్" గురించి ఆలోచిస్తుంటారని దానిలో ఒక అంతర్భాగం స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకుని వెళ్ళేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

===================

సమాజంలో ఆడ పిల్లల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆడపిల్లలను కాపాడుకుందాం, భ్రూణ హత్యలు, మహిళల హత్యలు, అత్యాచారాలను అరికడదాం అన్న నినాదాలతో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని పూలపల్లిలో ఈ రోజు 2కె రన్ ట్రైల్ ను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన 2 కె రన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా "ఆడపిల్లలను కాపాడుదాం" అనే పేరుతో 2కే రన్ కార్యక్రమాన్ని 2014 నుంచి నిర్వహిస్తున్నామని నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

===================

అనకాపల్లిలో నిర్వహిస్తున్న 65వ కిసాన్ మేళా కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఈ రోజు ప్రారంభించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు వ్యవసాయం చేసేటప్పుడు కలిగే ఇబ్బందులను పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో వాతావరణ మార్పులకు అనుకూలంగా లాభసాటి వ్యవసాయం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అనుకూల వాతావరణ ఉన్న పంటలు పండించాలని శాస్త్రవేత్తలు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

===================

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా రేపటి నుండి ఈనెల 20వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ యస్.ఇ. జి.యన్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. "విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం" అనే అంశంపై వర్క్ షాపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

====================

దక్షిణ అండమాన్ సముద్రంపై రేపు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రానున్న 48 గంటల్లో అల్పపీడనంగా మారి పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు తీరాల వైపు కదులుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ అధికారి తెలియచేస్తూ..

(వాయిస్ 22 సెకన్లు)

====================

స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయనగరం సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమం విజయవాడలో ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయనగరం కలెక్టరేట్ లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమాన్ని జేసీ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు వీక్షించారు. స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

====================

జిల్లాలోని 213 సాగునీటి సంఘాలకు రేపు ఎన్నికలు జరగనున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 22 భారీ నీటి పారుదల, 25 మధ్య తరహా, 166 చిన్న తరహా నీటి వనరుల ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

====================

విశాఖపట్టణంలో ఈ నెల 15వ తేదీన నేవీ మారథాన్ ను నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకూ ఈ  కార్యక్రమం నిర్వహిస్తారు.  స్థానిక రామకృష్ణా బీచ్ నుండి ఐ.ఎన్.ఎస్. కళింగ వరకు వెళ్లి మరలా అక్కడ నుండి బీచ్ వద్దకు చేరుకునేలా రూపొందించారు. మొత్తం 42 కిలో మీటర్ల మేర నేవీ మారథాన్ సాగనుంది.

====================

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు నిర్వహించిన జాబ్ మేళాలో 15 మంది యువతీ, యువకులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య తెలిపారు.

====================
====================